మన్మద్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-లోకేశ్వరం

శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ జయంతి సందర్భంగా మండలంలోని మన్మద్ జడ్‌పీఎస్-ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం, ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ క్రమంలో తమ తమ అభిప్రాయాలు తెలిపారు. అనంతరం విద్యార్థులందరూ వివిధ రకాలైన వంటకాలను తీసుకొచ్చి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఆహారోత్సవ కార్యక్రమం గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దేవేందర్, ఉపాధ్యాయులు రాజేందర్, సుధీర్‌కుమార్, ప్రశాంత్, విజయ కుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నవతెలంగాణ

నమ్మదగిన తెలుగు దినపత్రిక

1

ఆదిలాబాద్

ఆదివారం | డిసెంబర్ 22, 2024 | www.navatelangana.com



12వ రోజుకు ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నిర్మల్ : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు తమ డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల ఐక్యతను తెలుపుతూ పెయింటింగ్ వేసి నిరసన తెలిపారు. డిసిసి అధ్యక్షులు కుచాడి శ్రీహరిరావును నివాసంలో కలిసి రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న నిరసన కార్యక్రమాల గురించి వివరించి, తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘం అధ్యక్షులు భూసారపు గంగాధర్, రాజారత్నం, నరేశ్, సాయినాథ్, రమేశ్, రమణ, నర్సయ్య, హరీశ్, శ్రీనివాస్, విఠల్, రాము, అర్షద్, విమల, వసంత పాల్గొన్నారు.

ఆ ఇంట్లో ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులే

- ఎస్ఎం.పాషాను సన్మానించిన మార్కెట్ కమిటీ చైర్మన్



నవతెలంగాణ-భైంసా

పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ సయ్యద్ మహమ్మద్ పాషా-షఫీయా దంపతులకు నలుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు. వీరంతా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమకం కావడంతో ఎస్ఎం. పాషాను మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్ శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఒక కుటుంబంలో ఆరుగురు టీచర్లు కావడం గర్వకారణమన్నారు. ఇద్దరు దంపతులు ప్రైవేట్ టీచర్లుగా పనిచేస్తూ పిల్లల్ని మంచి చదువులు చదివించి, వారిని ఉన్నత స్థానంలో ఉంచడం అభినందనీయమన్నారు. ఆరుగురు సంతానంలో మొదటి కూతురు హర్షియా ఇంద్రవెల్లిలో ఎస్‌జిటిగా, రెండవ కూతురు సుమియా మామడ మండల కేంద్రంలో, మూడవ కూతురు సానియా పిజిటిగా, చిన్న కూతురు రుబి నిర్మల్‌లో ఎస్‌జిటిగా, ఇద్దరు కొడుకులు అతిఫ్ ఓమెద్, ఫహద్ ముధోల్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లలందరూ టీచర్లు కావడంతో ఆ కుటుంబంలో సంతోషం నెలకొంది. సన్మాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

బంగారుగూడ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

మండలంలోని బంగారిగూడ పాఠశాలలో శనివారం తెలంగాణ వారోత్సవాల సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. దీనికి డీఈఓ ప్రణీత, ఎంఈఓ సోమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు మంచి పోషకాహారం పెట్టాలన్నారు. చదువుపై శ్రద్ధ చూపే విధంగా రెగ్యులర్‌గా పాఠశాలకు పంపాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు మంద అశోక్ సొంత ఖర్చులు, కొంత గ్రాంట్‌తో ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం అతిథులు ఫుడ్ ఫెస్టివల్‌ను పరిశీలించి వంటకాల రుచి చూశారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి నారాయణ , సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

సజావుగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల కేంద్రంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సజావుగా సాగింది. మండలంలోని 30 గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై శనివారం రైతువేదికలో 14వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు రూ.5.82 కోట్లతో వివిధ పనులు చేపట్టారు. వీటిపై పది బృందాలతో డీఆర్పీలు, ఎస్ఆర్పీలు, వీపీలు తనిఖీ చేశారు. ఇందులో పలు అవకతవకలు గుర్తించినట్లు డీఆర్‌డీఓ సాయన్న తెలిపారు. అవకతవకలకు పాల్పడిన వారి నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా సాయన్న మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఉపయోగపడే మొక్కలు నాటాలని, పాఠశాలలో మునగ, కరివేపాకు, బొప్పాయి తదితర మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ కుటుంబరావు, డివిఓ రాజేశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపిఓ శ్రీనివాస్, ఎస్ఆర్పి దేవేందర్ పాల్గొన్నారు.

నరసింహ స్వామి ఆలయంలో రిమ్స్ డైరెక్టర్ పూజలు

నవతెలంగాణ-తాంసి

వడ్డాడి లక్ష్మీ నరసింస్వామి ఆలయంలో శనివారం రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ కమిటీ తరపున పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు పురాతన ఆలయ చరిత్ర గురించి వివరించారు. వందల సంవత్సరాల క్రితం నుండి ప్రతి శివరాత్రికి ఇక్కడ జాతర నిర్వహిస్తామన్నారు. ప్రతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తామని ఆలయ చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీకాంత్, నాందేవ్, కాదే పోతన్న, పాలకొండ సత్యనారాయణ, తోకల యాదన్న, సిరిగిరి అశోక్, రమాకాంత్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రేపు నిర్మల్‌లో జాబ్‌మేళా

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు సోమవారం పేటీఎం కంపెనీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి గోవింద్ తెలిపారు. పదో తరగతి, ఆపై విద్యా అర్హతతో 100 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల జిల్లాతో పాటు ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నిరుద్యోగ యువకులు మాత్రమే తమ బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికేట్ జిరాక్స్ కాపీలతో సోమవారం ఉదయం 11గంటలకు నిర్మల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల ప్రాంగణంలో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9390227923, 9441535253 నెంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కామన్ మెనూ సాధ్యమేనా..?

- గురుకులాలకు క్యాటరింగ్ సదుపాయం
- వసతిగృహాలను వేధిస్తున్న సిబ్బంది కొరత
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న హెచ్‌డబ్ల్యూఓలు
- అమలులో ఆదిలోనే ఎదురవుతున్న అవాంతరాలు
- సమస్యలు పరిష్కరిస్తేనే అందరికీ నాణ్యమైన భోజనం

ప్రభుత్వ వసతిగృహాల విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ మెనూలో ఆదిలోనే అవాంతరాలు ఎదురవుతున్నాయి. వసతిగృహాల్లో చదివే విద్యార్థులందరికీ ఒకేరకమైన నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కామన్ మెనూ అమలు చేస్తోంది. ప్రభుత్వ లక్ష్యం బాగున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఉత్పన్నమవుతున్న సమస్యల కారణంగా మెనూ అమలులో ఆటంకాలు ఎదురవుతున్నాయి. గురుకులాల్లో టెండర్ ప్రక్రియ ద్వారా ప్రభుత్వం భోజనం పెట్టడాన్ని క్యాటరింగ్ పద్ధతిలో అప్పగించగా.. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వసతిగృహాలకు మాత్రం ఆ పద్ధతి లేకపోవడం.. హెచ్‌డబ్ల్యూఓలే స్వయంగా సరుకులు కొనుగోలు చేయడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. మరోపక్క ఈ వసతిగృహాల్లో వంట చేసేందుకు సరిపడా సిబ్బంది లేకపోవడమూ మరో సమస్యగా మారుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వం అన్నింటికీ ఒకే విధమైన మెనూ అమలు చేయాలంటే క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అప్పుడే ప్రభుత్వం ఆశించిన లక్ష్యం నెరవేరే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

వేలాది మంది నిరుపేద విద్యార్థులకు వసతితో కూడిన నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటుచేసింది. వీటితో పాటు జిల్లా, మండల కేంద్రాల్లో ఉండి ఉన్నత చదువులు చదివేందుకు ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వసతిగృహాలను సైతం ఏర్పాటుచేసింది. ఇక ఐటీడీఏ పరిధిలో ఆశ్రమ పాఠశాలలతో పాటు కస్తూర్బాగాంధీ, మోడల్ స్కూల్‌లు తదితర వాటిలో వసతితో కూడిన విద్యనందిస్తోంది. ఇప్పటి వరకు వీటిలో వివిధ రకాల ఆహారపట్టికలను అమలు చేస్తూ వచ్చింది. గురుకులాలకు క్యాటరింగ్ సౌకర్యం ఉండగా.. కొన్నింటికీ టెండర్ ద్వారా సరకులు సరఫరా చేయడం.. మరికొన్నింటికీ వసతిగృహ అధికారులే స్వయంగా సరుకులు తీసుకొచ్చి విద్యార్థులకు వండి పెడుతున్నారు. ఒక్కో వసతిగృహంలో ఒక్కో రకమైన భోజనం అమలు చేసేవారు. కానీ ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం మెనూలో మార్పులు చేసింది. వసతిగృహ సౌకర్యం కలిగిన అన్నింటికీ ఒకే విధమైన కామన్ మెనూను అమలు చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా వారం రోజుల క్రితమే ఈ పద్ధతిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తోంది. ముఖ్యంగా గతంలో ఉన్న మెస్ ఛార్జీల కంటే అదనంగా 40శాతం పెంచి అమలు చేస్తోంది. వీటితో పాటు విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలను సైతం పెంచింది. కానీ మెనూ అమలులో మాత్రం వివిధ రకాల సమస్యలు ఉత్పన్నం అవుతుండటంతో అధికారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..!

గురుకులాలకు క్యాటరింగ్ సౌకర్యం ఉండటంతో ఇక్కడ మెనూ అమలు చేయడంలో అంతగా ఇబ్బందులు కలగడం లేదు. కానీ ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతిగృహాల్లో మాత్రం ఈ పద్ధతి లేకపోవడంతో సమస్య వస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఉదయం టిఫిన్‌లో పూరీలు, బొండాలు, ఇడ్లీలు, సాంబార్, రాగిజావ, పులిహోర, మిల్క్ విత్ బూస్ట్, ఉప్మా, రైస్‌పొంగలి తదితర వాటితో చికెన్,మటన్, గుడ్లు అందించాల్సి ఉంటుంది. వారంలో ఒక్కో రోజు ఒక్కో మాదిరిగా వివిధ రకాల టిఫిన్లు అందించాల్సి ఉంటుంది. దీంతో వసతిగృహాల్లో ఇద్దరే కుక్‌లు(వంట మనుషులు) ఉండటం.. వీరికి వివిధ రకాల టిఫిన్లు తయారుచేయడంలో ఇబ్బందులు వస్తున్నాయి. కొంత మందికి వండే విధానం తెలియడం లేదు. మరోపక్క సరుకుల కొనుగోలులోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్ మెనూ వసతిగృహాల్లో అమలు చేయడం సాధ్యం కావడం లేదని పలువురు హెచ్‌డబ్ల్యూఓలు చెబుతున్నారు. ఈ విషయమై ఇది వరకే జిల్లా ఉన్నతాధికారులకు సైతం విన్నవించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోపక్క నిధులు సైతం సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆయా సమస్యలపై దృష్టిసారించి సారించడంతో పాటు గ్రీన్ ఛానెల్ ద్వారా క్రమం తప్పకుండా నిధులు అందజేస్తేనే కామన్ మెనూ అమలు చేయడం సాధ్యమవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్షేత్రస్థాయి సమస్యలు పరిష్కరించాలి : పూసం సచిన్, తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



ప్రభుత్వం అన్ని వసతిగృహాలకు ఒకే విధమైన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన కామన్ మెనూ పద్ధతిని స్వాగతిస్తున్నాం. కానీ ఆచరణలో మాత్రం క్షేత్రస్థాయిలో మాత్రం అమలు కావడం లేదు. దీనికి బిల్లులు రాకపోవడంతో పాటు సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వేధిస్తోంది. ప్రభుత్వం తొలుత ఈ సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం : రాజలింగు, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన కామన్ మెనూతో విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ వసతిగృహాల్లో ఈ మెనూ అమలు చేయడంలో ఇబ్బందులు వస్తున్నాయని హెడబ్ల్యూఓలు మా దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినాం.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌లో మృతి చెందిన విద్యార్థిని వెంకటలక్ష్మి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజా, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో అనేక సంఘటనలు జరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా వెంకటలక్ష్మి మృతి చెందడం బాధాకరమన్నారు. విద్యార్థిని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టీకానంద్, కార్తీక్ పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి తిరుపతి, బీసీ యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతిగృహ సంక్షేమ అధికారి సస్పెండ్

జిల్లా కేంద్రంలోని బీసీ పోస్టుమెట్రిక్ హాస్టల్‌లో ఉంటూ చదువుతున్న విద్యార్థిని మృతి పట్ల విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు నాయకులు చేసిన నిరసనలకు స్పందించిన కలెక్టర్ వెంకటేష్ దోత్రే హాస్టల్ వార్డెన్ నికత్ తరన్‌ను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హాస్టల్‌లో విధి నిర్వహణ సరిగ్గా లేకుంటే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

బిల్లులు, వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

బిల్లులు, వేతనాలు చెల్లించి మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించటం కొరకు కార్మికులు అప్పులు తెచ్చి అవమానాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో బిల్లులు, వేతనాలు చెల్లించి కార్మికులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇచ్చే మెనూకు ఇప్పుడున్న చార్జి ఏమాత్రమూ సరిపోవటం లేదని, మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో గుడ్డు ధర రూ.7 ఉంటే ప్రభుత్వం ఇచ్చేది రూ.5 అని, ఈ పరిస్థితుల్లో వారంలో మూడు గుడ్లు పెట్టడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అంగన్వాడి కేంద్రాల మాదిరిగా ప్రభుత్వమే నేరుగా అన్ని పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయాలని కోరారు. కాంగ్రెస్ ఎన్నికలలో మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా రూ.10వేల వేతనం ఇచ్చే విధంగా బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన యూనియన్ మండల కార్యదర్శి విజయ, మంజుల, రాజేశ్వర్, మంగ, లక్ష్మి పాల్గొన్నారు.

సాంప్రదాయ పంటలు

ఆధునిక పద్ధతుల్లో సాగు చేసేలా ప్రోత్సహించాలి

- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

ఆధునిక పద్ధతులలో సంప్రదాయ పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ ఆహార భద్రత పథకం-2024 కింద జిల్లాలో వ్యవసాయ శాఖలో అమలవుతున్న కార్యాచరణపై వ్యవసాయ శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆధునిక పద్ధతుల ద్వారా సాంప్రదాయ పంటలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో వరి, జొన్న, నూనె గింజలు, పప్పు ధాన్యాల విస్తీర్ణం పెంచాలని, అలాగే అధిక దిగుబడులు సాధించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకుగాను కార్యాచరణ అమలుకు కోటి రూపాయల నివేదిక ఆమోదించడం జరిగిందన్నారు. కృత్రిమ ఎరువులు అధికంగా వాడటం వల్ల భూసారం దెబ్బ తినడంతో పాటు వాటితో పండిన పంటలు అనేక రకాల వ్యాధులకు కారణమవుతాయని తెలిపారు. ఇప్పటికే ప్రజలంతా సేంద్రీయ ఉత్పత్తుల వైపు మల్లుతున్నారని తెలిపారు. సహజ సిద్ధ ఎరువులతో పండించిన పంటలకు విపణిలో మంచి గిరాకీ ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి ఉన్న మరింత మంది రైతులను గుర్తించి, రైతుల ద్వారా రైతులకు అవగాహన' అనే విధానంతో సేంద్రియ పంటలను సాగుపై అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలకు ఆసక్తి ఉన్న రైతులను తీసుకెళ్లి మెలకువలను నేర్పాలని, సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహించాలాన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లలో సేంద్రియ ఉత్పత్తుల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, డీఆర్డిఓ విజయలక్ష్మి, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ తన ఛాంబర్ లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌తో కలిసి ఆమె రెవెన్యూ, భూగర్భ జల, మైనింగ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నిర్మూలించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన ప్రాంతాలలోనే రాయల్టీ రుసుం చెల్లించి ఇసుక తవ్వకాలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని వాగులు, నది పరివాహక ఇసుక తవ్వకాల ప్రాంతాలను గుర్తించి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. తహసీల్దారులు ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నూతన ఇండ్ల నిర్మాణ అనుమతులు పంచాయతీ కార్యదర్శుల ద్వారా మంజూరు చేసి ఆ నిర్మాణాలకు అవసరమగు ఇసుకకు వారే అనుమతులు ఇప్పించాలన్నారు. సమావేశంలో ఏడి మైన్స్ రవీందర్, డిపిఓ శ్రీనివాస్, నిర్మల్, భైంసా ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, తహసిల్దార్‌లు, భూగర్భ జల, మైనింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల రాస్తారోకో.. భారీగా ట్రాఫిక్ జామ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంట్రాక్టు ఏఎన్ఎంలకు రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేయాలని నిరసన కొనసాగిస్తున్నారు. 48 గంటల పాటు చేపట్టిన నిరసన దీక్ష ముగిసింది. ఇందులో భాగంగా శనివారం కలెక్టర్ చౌక్‌లో రాస్తారోకో చేపట్టారు. వాహనాలు రాకుండా అడ్డుకున్నారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు జోక్యం చేసుకొని వారిని సముదాయించినా వినిపించుకోలేదు. అనంతరం వారిని అరెస్ట్ చేయడానికి ప్రయత్నించే క్రమంలో తమ ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్.నవీన్ కుమార్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. వెంటనే రాత పరీక్షను రద్దు చేయలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఏఎన్ఎంలు పుష్పల, ఆనందబాయి, పద్మ, తులసి, లలిత, మనీలత, ప్రియదర్శిని, సులోచన, అహల్య, లక్ష్మి, కరుణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ధ్యాన దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో 32 తెలంగాణ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. శనివారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శిక్షకులు వై. ఓం ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధ్యానం విశిష్టతను వివరిస్తూ అందరితో వివిధ రకాల ధ్యానాన్ని చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఘు గణపతి, ఎన్‌సీసీ జేసీఓ భగీరథరామ్, కేర్ టేకర్ అధికారి చంద్రకాంత్, బెటాలియన్ సిబ్బంది బ్రిజేష్ కుమార్, ఆంజనేయులు, క్యాడేట్లు పాల్గొన్నారు.

సీఆర్టీల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-ఉట్నూర్



6రోజుల నుండి ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీఆర్టీలు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్టీల న్యాయమైన 9 డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సీఆర్టీలకు మద్దతుగా అసెంబ్లీ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, సీఆర్టీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

గంజాయి అంతానికి పకడ్బందీగా చర్యలు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో గంజాయి, తదితర నార్కోటిక్ మత్తు పదార్థాలను పూర్తిగా అంతం చేసేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఛాంబర్‌లో అధికారులతో నార్కోటిక్ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాల బారిన ప్రజలు పడకుండా ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సారథి కళాకారుల గ్రామగ్రామాన గంజాయి, పొగాకు, తదితర వాటిపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఆయా శాఖలకనుగుణంగా ప్రజల్లో సారథి కళాకారులచే అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. రవాణ, క్రయ విక్రయాలను నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టాలన్నారు. ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో డ్రగ్స్ నివారణ విషయం మీద వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. తరగతుల వారీగా యాంటీ డ్రగ్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. బడికి రాని, బడి మానేసిన పిల్లల వివరాలు సేకరించి డ్రగ్స్ బారిన పడకుండా పిల్లలకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, వ్యవసాయ క్షేత్రాల్లో గంజాయి పెంచకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల పరిసర ప్రాంతాల్లో మత్తు చాక్లెట్లు, ఇతరత్రా పదార్థాల రూపంలో డ్రగ్స్ విక్రయాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో గంజాయి అనే పదం వినపడకుండా గంజాయిపై ఉక్కు పాదం మోపాలని, అందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది 75 కేసులు నమోదయ్యాయని, ఇప్పటి వరకు 987.425 కిలోల గంజాయి పట్టుకొని, సుమారు రూ.2 కోట్ల 31 లక్షల 31 వేల 750 విలువ గల గాంజ కేసులు నమోదు చేశామన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామలా దేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్, ఆర్డీఓ వినోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులున్నారు.

ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామనుజన్ జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవ వేడుకలను పట్టణంలోని ఆయా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈనెల 22న శ్రీనివాసన్ జన్మదినం కాగా ఆ రోజు ఆదివారం కావడంతో శనివారమే పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో గణిత దినోత్సవం సందర్భంగా ప్రదర్శనాలు నిర్వహించారు. దీనికి ప్రభుత్వ గణిత సబ్జెక్ట్ ఉపాధ్యాయులు గిరిష్, సుకుమార్, మహేందర్, అథిత్య కళాశాల ప్రిన్సిపల్ రకేష్ తో పాటు స్కూల్ ప్రిన్సిపల్ కమలకర్ రెడ్డి ముఖ్య అతితుగా హాజరయ్యారు. ముందుగా ప్రదర్శనలను ప్రారంభించి విద్యార్థులు గణిత దినోత్సవం సందర్భంగా తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించి అభినందనలు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

గౌతమ్ మాడల్ పాఠశాలలో

పట్టణంలోని గౌతం మోడల్ పాఠశాలలో మ్యాథ్స్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గణిత ప్రదర్శనాలు ఇవ్వడం విద్యార్థులు వాటిని తిలకించారు. ముందుగా రాజమనుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలించి విద్యార్థుల ప్రతిభను చేసి ఉపాధ్యాయులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బసంత్ కుమార్ దాస్, వైస్ ప్రిన్సిపల్ షర్జిల్, లక్ష్మీ, పీఈటీ గోవింద్, నగేష్ ఉన్నారు.

సైన్స్ కళాశాలలో రామానుజన్ జయంతి

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సంగీత పాల్గొని రామానుజన్ చిత్రపటానికి పూలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రావణి, జగరాం అంతర్వేది, చక్రవర్తి, శ్రీధరాదేవి, మంజుల, జోత్స్న, రవి కిరణ్, రాజ్ కుమార్, శ్రీనివాస్, విద్యారాణి, నారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్నం పెట్టే అన్నదాతలు సంతోషంగా లేరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు సంతోషంగా లేరని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం అసెంబ్లీ సమావేశాల్లో రైతుల సమస్యల గురించి ప్రభుత్వానికి నివేదించారు. వ్యవసాయం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. రైతులు తమ పిల్లలకు కార్పొరేట్ విద్యను అందించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. విద్య వైద్య రంగాల్లో రైతులకు ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విత్తనాలు ఎరువులు పంట పొలాలకు తీసుకెళ్లేందుకు పండించిన పంటను తిరిగి ఇంటికి తెచ్చుకునేలా పంట పొలాలకు వెళ్లే రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

రేపు సైన్స్ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అప్‌గ్రేడ్ సహకారంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ముతూట్ ఫిన్ కార్ప్‌లలో శాశ్వత ప్రాతిపాదికన ఉద్యోగుల కోసం పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ కళాశాలలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంగీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకులలో నెలకు రూ.20వేల పైన జీతభత్యాలు అందుకొనే సువర్ణ అవకాశమన్నారు. ఈనెల 23న సోమవారం ఉదయం 10 గంటల నుండి ఇంటర్వ్యూ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, బిటెక్‌లో 50శాతం మార్కులు కలిగి ఉండి 1994-2004 మధ్య జన్మించి 30 సంవత్సరాలలోపు వయసు గలవారు అర్హులన్నారు. నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8106764653 నంబరును సంప్రదించాలని సూచించారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

- పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్
- ప్రచార కరపత్రాలు ఆవిష్కరించిన నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ కోరారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో మహాసభలకు సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమాల దిక్సూచి, పోరాటాల సారధి, కష్టజీవుల గొంతు సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25-28 తేదీల్లో సంగారెడ్డి పట్టణంలో జరుగనున్నట్లు తెలిపారు. నిరంకుశంగా పాలించిన బీఆర్ఎస్‌ను ఓడించి ఆరు గ్యారంటీలను నమ్మి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రభుత్వం మారింది తప్ప ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఒకటి రెండు గ్యారంటీలను అరకొరగా అమలు చేసి చేతులు ఎత్తేసే పని రాష్ట్ర ప్రభుత్వం పెట్టుకున్నదని విమర్శించారు. కార్మికులు, కాంట్రాక్టు ఉద్యోగులు, రుణమాఫీ కానీ రైతులు ఇలా క్రమంగా అన్ని వర్గాల ప్రజల్లో కాంగ్రెస్ పాలన పట్ల వ్యతిరేకత పెరుగుతుందన్నారు.

అంబానీ, ఆదానిల సర్కార్‌గా మారిన మోదీ ప్రభుత్వం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల సర్కార్‌గా మారిందని ఎద్దేవ చేశారు. నిత్యావసర సరుకులు, పెట్రోల్, గ్యాస్ ధరలు సామాన్యునికి అందకుండా చేసి, కార్పొరేట్లకు లాభాలు చేయడమే పనిగా పెట్టుకున్నదన్నారు. ప్రజల వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి మతవిద్వేషాలు రెచ్చగొట్టి పాలించడం నేర్చుకున్నదన్నారు. అందులో భాగమే పార్లమెంట్‌లో అమిత్ షా అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) పార్టీ రాష్ట్ర మహాసభలకు ఆర్థిక, హార్దిక సహకారం అందించి జయప్రదం చేయాలనీ కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లంక రాఘవులు, తొడసం భీంరావు, జిల్లా కమిటీ సభ్యులు బొజ్జ ఆశన్న, ఆర్.మంజుల, ఆర్.సురేందర్, నాయకులు కే.ఆశన్న, ప్రభు, ధోనిపెల్లి స్వామి, మోహన్, అశోక్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అట్టహాసంగా ఫుడ్ మేళా

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని మండగడ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం నిర్వహించారు. రకాల వంటకాలను విద్యార్థులు ఇంటి దగ్గర తయారు చేసుకొని వచ్చి పాఠశాలలో ప్రదర్శన నిర్వహించారు. సమావేశానికి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు వంటకాలను రుచి చూసి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రమణి, ఉపాధ్యాయులు అర్చన, సునందా, అస్మా, మాచ్చెందర్, సంతోష్, స్కూల్ సబార్డినేట్ రషీద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ :

పట్టణంలోని సరస్వతి నగర్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ఫుడ్ మేళాను నిర్వహించారు. తెలంగాణ ఆహార ఆహారోత్సవాల్లో భాగంగా శనివారం ఈ ఫుడ్ మేళ నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు ఇంటి నుంచే తయారు చేసిన తీసుకువచ్చిన వంటకాల ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్టారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా వాటిని కొనుగోళుచేసి రుచులను చూశారు. తెలంగాణ ఆహారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించేల కార్యక్రమాన్ని చేపట్టామని, 6 నుంచి పదవ తరగతి విద్యార్థులు ఇందులో పాల్గొన్నారని హెచ్‌ఎం అనురాధ తెలిపారు. పోషకాలు, న్యూటిషియన్, మినరల్ ఉన్న పదర్ధాలను ప్రదర్శించడంతో పాటు అమ్మకాలు చేపట్టారన్నారు. మొత్తం 56 స్టాళ్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్ల శ్రీవిధ్య, పీడీ రేణుక, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

420 హామీలిచ్చి విఫలమైన కాంగ్రెస్



- మాజీ మంత్రి జోగురామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులతో పాటు ప్రజానీకానికి 420 హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన బాధ్యత, ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన ప్రభుత్వం మొద్దు నిద్ర వీడడం లేదన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ పథకాలపై సర్వే చేస్తున్నారన్నారు. ఆదివాసీ గ్రామమైన చించుఘాట్‌లో 150 మంది రైతులు రూ.రెండు లక్షలలోపు రుణాలు తీసుకుంటే 60 మందికే మాత్రం రుణాలు మాఫీ అయ్యాయని తెలిపారు. తంతోలిలో 266 మందికి పట్టాలుంటే 232 మంది, పెండల్‌వాడ, సాంగ్విలను కలిపి 2560 మంది రైతులుంటే 1230 మందికి మాత్రమే అయిందన్నారు. దీపాయిగూడలో 400 మందికి రుణమాఫీ కాలేదన్నారు. సగానికి సగం రైతులకు మాఫీ కాలేదని తెలిపారు. రైతు సంబరాల్లో 4వ విడతలో జిల్లాలో 6600 మందికి మాఫీ చేస్తే ఒక్కరి ఖాతాలో నగదు జమ కాలేదన్నారు. ఆర్భాటంగా సీఎం ప్రకటించిన ఏ ఒక్కరికి కూడా కాలేదన్నారు. రైతులు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రైతు భరోసా ఊసే లేదని, భూముల్లో రాళ్ల రప్పలున్న వాటిని పంపిణీ చేశారని ఆరోపించారు. సోయా పంట కొనుగోళ్లలో తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. వీటిపై సమగ్ర సర్వే కొనసాగుతుందని త్వరలో ఆ రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గంద్రత్ రమేష్, సాజిదొద్దిన్, రాజన్న, సేవ్వా జగదీష్, కుమ్ర రాజు, పరమేశ్వర్, ఆష్రమ్ గంగయ్య, బట్టు సతీష్, ఉగ్గే విట్టల్, దయాకర్ పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రైతుల రుణమాఫీ చేయాలి

- రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని రైతు స్వరాజ్యవేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. శనివారం మండలంలోని ధనోర(బి) గ్రామంలో ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతుల పేరిట ఎంత రుణం ఉన్న రూ.2లక్షల వరకు పూర్తిగా రుణమాఫీచేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలో వచ్చిన తరువాత కాలయాపన చేస్తూ మూడు విడతలుగా రూ.608.88 కోట్లు మాత్రమే మాఫీ చేసిందన్నారు. జిల్లాలో మొత్తం 1.17 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకున్నారని తెలిపారు. ఇంకను సగం మంది రైతులకు రేషన్ కార్డు లింకులు, రూ. రెండు లక్షలపైన ఉన్న రైతులకు రుణమాఫీ చేయలేదని ఆరోపించారు.



రుణాలు తీసుకున్న రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ సీఐ సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడటంతో వారు రాస్తారోకోను విరమించారు. రైతులు బాలాజీ, సతీష్, రవి, లక్ష్మణ్, రమేష్, రాజు పాల్గొన్నారు.



జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల అనారోగ్యం కారణంగా మీడియా కెమెరామెన్ కంచు సుభాష్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి శనివారం పట్టణంలోని కొలిపూర్‌లో ఉన్న ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అకాల మరణంపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్నారు. తన వంతుగా ఆర్థిక సాయం అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.. ఆయన వెంట సభ్యులున్నారు.

పోషకుల సమావేశానికి ఎన్‌సీఈఆర్టీ ఢిల్లీ ప్రొఫెసర్



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజురా మండల ప్రజా పరిషత్ (ఎంపీపీఎస్) పాఠశాలలో శనివారం పోషకుల సమావేశం నిర్వహించారు. దీనికి ఢిల్లీ ప్రొఫెసర్ సుశీల్ కుమార్ తివారీ హాజరై సందర్శించారు. ఈ సందర్భంగా పోషకులతో మాట్లాడారు. పిల్లలపై అనవసర లక్ష్యాలను నిర్దేశించొద్దని, స్వేచ్ఛగా ఎదగనీయాలని ప్రొఫెసర్ సూచించారు. పాఠశాలలో జరిగిన పౌష్టికాహారా మేళను పరిశీలించారు. ఈ క్రమంలో 1వ తరగతి చదువుతున్న పిల్లలతో మాట్లాడారు. పాఠశాలలోని పరిశుభ్రతను, మధ్యహన భోజనాన్ని పరిశీలించారు. గ్రామస్తులు, పోషకులు సహకారాన్ని అభినందించారు. తెలంగాణ పోషక ఆహార పదార్థాలను మొలకెత్తిన విత్తనాలు, గుడాలు, శనగలు, పండ్ల రుచులు చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేసి ప్రధానోపాధ్యాయులు జెడ్ల రాజేశ్వర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఎన్ఆ నర్సయ్య, ఎన్‌సీఈఆర్టీ ఎస్ఈ ముత్తన్న, ఏపీసీ చైర్మన్ సరస్వతి, వీడీసీ చైర్మన్ ప్రవీణ్, మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, మాజీ ఎంపీటీసీ నర్సవ్వ పోతన్న, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సాయిప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ముజాహిత్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలి

- దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారానే పదవులను అనుభవిస్తూ ఆయనను అవమాన పరిచేలా కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవడంతో పాటు తన పదవికి రాజీనామ చేయాలని కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం దళిత సంఘాలు, ఆయా పార్టీల ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ అంబేద్కర్ చౌక్‌లో ఆందళోన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నినాదాలు చేశారు. అనంతరం అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హోం శాఖ మంత్రి పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ పేరును తలవడం కంటే దేవుడి పేరు తలచుకుంటే స్వర్గం ప్రాప్తిసుందని మాట్లాడడం అహంకారానికి నిదర్శమన్నారు. బడుగుబలహీన వర్గాల కోసం రాజ్యాంగం రచించి ఇచ్చిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. అనగారిన వర్గాల్లో ఆశ జ్యోతిగా వచ్చిన ఆయన్ను ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన అమిత్ షా అవమానించేల వ్యాంగంగా మాట్లాడడం సరికాదన్నారు. వెంటనే ఆయన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవడంతో పాటు మంత్రి పదవికి రాజీనామ చేయాలన్నారు. అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు భారత్ వాఘ్మరే, రత్నజాడే ప్రజ్ఞాకుమార్, జమీల్, శోభతాయి తుల్జాపూరే, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

అనుమతుల లేకుండా భవన నిర్మాణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఆదర్శనగర్ కాలనిలో మున్సిపల్ అనుమతులు లేకుండా నాలుగు అంతస్థుల భవనం నిర్మించారని దీనిపై చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ బడాల సుజాత, సృజన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై శనివారం మున్సిపల్ కమిషనర్ రాజును కలిసి ఫిర్యాదు చేస్తూ వినతిపత్రం అందజేశారు. కాలనీలోని సర్వే నెం.52/1/2లో నిర్మించిన నాలుగు అంతస్థుల భవనం ఎలాంటి మున్సిపల్ అనుమతులు లేకుండా కట్టడం జరిగిందన్నారు. పలుమార్లు కాలనీ తరపు నుంచి బల్దియాకు అభ్యంతరాలు వచ్చిన మామూళ్ళకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కమీషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు నిరసన ర్యాలీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి చేసిన వ్యాక్యాలకు నిరసనగా ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుండి ఉదయం 11 గంటలకు నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ర్యాలీని విజయవంతం చేయాలని అంబేద్కర్ ఆత్మ గౌరవ ఉమ్మడి ఉద్యమ కార్యాచరణ కమిటీ నాయకులు గణేష్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోనీ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల జెండాలను పక్కనపెట్టి కులమతాలకు అతీతంగా అంబేద్కర్ వాదులు, మానవతావాదులు, విద్యావంతులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అంబేద్కర్‌ను అవమానించడం అంటే మన జాతుల ఆత్మగౌరవంపైన జరుగుతున్న దాడిగా పరిగణించాల్సిందిగా కోరారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ఉమ్మడి అందరం ఉద్యమించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ మాట్లాడుతూ అమీత్ షా వెంటనే రాజీనామా చేయాలని, అంబేద్కర్‌ను పార్లమెంట్ సాక్షిగా అవమాణించడాన్ని ఖండించారు. సాజిదొద్దిన్ మాట్లాడుతూ రేపటి నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ధాండ్గే సందీప్, నిమ్మల ప్రశాంత్, ఈర్ల దయాకర్, నవీన్, న్యాయవాది మహ్మద్ గౌస్, అర్బత్ ఖాన్, నజీర్, శైక్ ఖలీల్, సంతోష్ ఉన్నారు.



నవతెలంగాణ
నమ్మిన తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | డిసెంబర్ 22, 2024 | www.navatelangana.com

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వానికి రాజీనామా

నవతెలంగాణ-కెరమెరి



మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పీఆర్టీయూటీస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘంలోని పలువురు మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో పీఆర్టీయూటీఎస్ సంఘానికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాన చేస్తున్నట్టు తెలిపారు. ఇక నుంచి ఆ సంఘానికి తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు సుమారు 15 మంది ఉపాధ్యాయ సంఘ నాయకులు రాజీనామాలను పంపించారు. కార్యక్రమంలో ఆడే మౌనిక, కల్పన, విటోభ, నరేష్, ధన్‌లాల్, విద్యాసాగర్, నగేష్ పాల్గొన్నారు.

రాళ్ల పేటలో ఆకట్టుకున్న బాలమేళా

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని రాళ్లపేట గ్రామంలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలు ఆయా పాఠశాలలో నేర్చుకున్న కార్యక్రమాలను మంచి అలవాట్లను ప్రదర్శించారు. ఇవి గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీడీపీఓ సాదియా రుక్సానా మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం ఎంతో ఆరోగ్యకరమైందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సింధూర, ఇందిరా, ప్రభావతి పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తీవారి



నవతెలంగాణ-రెబ్బెన

ప్రభుత్వ పాఠశాలలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. మండలంలోని గోలేటి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి పాఠశాల పరిసరాలు, విద్యార్థులకు అందిస్తున్న మెనూ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని, వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టలేదని హెచ్ఎంపై అదనపు కలెక్టర్ అగ్రం వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటన పునరావృతంకాకుండా చూడాలని ఆదేశిస్తు కంప్లెక్స్ హెచ్ఎంకు షోకాజ్ నోటీసు జారీ చేవారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీల..

అనంతరం గోలేటి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇండ్ల యాప్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా సర్వే ప్రక్రియను పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్, ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు క్షమార్హం కానివి

- డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్
- కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

డా.బాబా సాహెబ్ అంబేద్కర్‌పైన కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వాక్యాలు క్షమార్హం కానివని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు జిల్లా కేంద్రాల్లోని అంబేద్కర్ చౌక్ వద్ద కేంద్ర మంత్రి వ్యాఖ్యలు నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర హోం మంత్రి పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, కేంద్రమంత్రి తన పదవికి రాజీనామా చేయాలని, దేశ ప్రజలందరికీ పార్లమెంట్ సాక్షిగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారతదేశానికి దిశ నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని ప్రతి భారతీయునికి ఆయన ఆదర్శ ప్రాయుడన్నారు. బీజేపీ మతోన్మాదంతో వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని, అంబేద్కర్‌ను అవమానించినందుకు క్షమాపణ చెప్పకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మసాదే చరన్, మాజీ ఎంపీపీ బొమ్మెన బలేష్ గౌడ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు ఎండీ ఆసిఫ్ అలీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, నాయకులు అబ్దుల్లా, వందన, మొహమ్మద్ రాఫిక్, జమీర్, గులాం జావేద్, అబ్బు, టేకం గంగారం, సఫాన్, గుండి మాజీ సర్పంచ్ దత్తు, బబ్లూ, మహేష్ గౌడ్, శివప్రసాద్, గోపాల్ నాయక్, షేక్ అసద్, కిరణ్, రాము, బాపురావ్ పాల్గొన్నారు.

సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలి



నవతెలంగాణ-కెరమెరి

సీఆర్టీల సమ్మె విరమణకు ప్రభుత్వం చొరవ చూపాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆ సంఘ నాయకులతో కలిసి మాట్లాడారు. సీఆర్టీల సమ్మెతో విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో నిరుపేద ఆదివాసీ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని పేర్కొన్నారు. సీఆర్టీలు సమ్మెకు దిగడంతో గిరిజన విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే టెన్త్ విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసి, రివిజన్ చేయాల్సి ఉండగా సీఆర్టీల సమ్మె పదో తరగతి విద్యార్థులపై ప్రభావం చూపుతుందన్నారు. గిరిజన సంక్షేమ శాఖలోని పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా సీఆర్టీలు విధులు నిర్వహిస్తున్నారన్నారు. మరో రెండు నెలల్లో వార్షిక పరీక్షలున్న నేపథ్యంలో ప్రభుత్వం చర్చలు జరిపి సమ్మె విరమణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెందోర్ మోతీరాం, సోము, మాజీ సర్పంచులు తొడసం జగన్నాథ్ రావు, రాయిసెంటర్ సర్‌మేడి కుంరం అంబారావు, శంకర్, జాడి మధుకర్, పోచయ పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడువాయి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు సాయికిరణ్ పుట్టినరోజు సందర్భంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగగా శనివారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, అరటిపండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు శంకరయ్య, నానయ్య, మహేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అందుగులగూడలో ఆందోళన

- పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట
- సబ్ కలెక్టర్ హామీతో విరమణ



బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న పోలీసులు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని అందగులగూడకు చెందిన డీఎడ్ విద్యార్థిని వెంకటలక్ష్మి శుక్రవారం ఆసిఫాబాద్ బీసీ పోస్ట్ మెట్రిక్ వసతిగృహంలో అనారోగ్యంతో మృతి చెందింది. వసతిగృహ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందిందని ఆరోపిస్తు శనివారం గ్రామంలోని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. జిల్లా అధికారుల వచ్చేవరకు అంత్యక్రియలు చేసేది లేదని గ్రామస్తులు ఆందోళన చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మృతిపై అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో నిరసన వ్యక్తం చేశారు. కుటుంబాన్ని ఆదుకొని నష్టపరిహారంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు గంటల పాటు ఆందోళన చేసిన పరిష్కారం కాకపోవడంతో కౌటాల సీఐ ముత్యం రమేష్, ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటనచడానికి చేరుకొని ఆందోళన కారులను నచ్చజేప్పే యత్నం చేశారు. వినకపోవడంతో వారిని చదరగొట్టేందుకు ప్రయత్నం చేసిన సద్దుమనగక పోవడంతో సబ్ కలెక్టర్ వచ్చినాయం చేయాలని అప్పటి వరకు విద్యార్థి శవంతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ క్రమంలో శవాన్ని తీసుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు రాంప్రసాద్, సారయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం బీఆర్ఎస్ తాలూకా నాయకుడు లెండిగురి శ్యామ్ రావు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి న్యాయం చేస్తామని చేయాలని డిమాండ్ చేశారు.

కుటుంబానికి న్యాయం చేస్తాం : సబ్ కలెక్టర్

అందగులగూడ గ్రామానికి చెందిన విద్యార్థిని కుటుంబాన్ని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా పరామర్శించారు. అధికారుల నిర్లక్ష్యంతోనే తమ కూతురు మృతి చెందిందని తల్లి ఆనంద సబ్ కలెక్టర్ వద్ద గోడును వెల్లబుచ్చుకుంది. ఈ విషయంపై కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థిని మృతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కమిటీ ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. తహసీల్దార్ భూమేశ్వర్, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి తహసీల్దార్ పోషణ, డీటీ భీమ్లా నాయక్, ఆర్ఐ సంతోష్ ఉన్నారు.



విద్యార్థి మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-వాంకిడి

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలలోని విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర, వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించి వంట గదులు, విద్యార్థులు నిద్రించే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని వసతిగృహ సంక్షేమ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన ఆహారాన్ని సకాలంలో అందించాలని, వంట చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యత గల నిత్యావసర సరుకులను వినియోగించాలన్నారు. కాలం చెల్లిన నాసిరకం సామాగ్రిని వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల మధ్యాహ్నభోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అదనంగా 10 మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అహ్మద్, ఎంపీడీఓ, వసతి గృహ సంక్షేమ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



వంట గదిని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



పెంచికల్‌పేట్ : మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తహసీల్దార్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగది, భోజనశాల, మూత్రశాలలు, మరుగుదొడ్లు, నిల్వ ఉన్న బియ్యాన్ని, రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మంచి వాతావరణం కల్పించాలని సూచించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యాదగిరి, ఉపాధ్యాయులు లక్ష్మీ, భారతి, ఆఫ్తాబ్ పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థుల బంగారు భవిష్యత్తు దృశ్య ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పౌష్టికరమైన ఆహారాన్ని అందిస్తుందని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఉన్న సోంపేట ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న సరుకులను, ఆహారాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని, ప్రభుత్వం ప్రకటించిన కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలతో భోజనం వడ్డించాలని సూచించారు.

కౌటాల : విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ కోట ప్రసాద్ అన్నారు. శనివారం మండలంని ముత్తంపేట్ గ్రామంలో ప్రాథమిక బారవాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి మౌలిక సదుపాయాలు పరిశీలించారు. వంట గది మధ్యాహ్న భోజనం పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రభుత్వం అందించే నూతన మెనూ ప్రకారం నిత్యం భోజనం ఇవ్వాలని ఆదేశించారు. ఎక్కడ పొరపటు జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంఈఓ గావుడె హనుమంతు , ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులున్నారు.



సిర్పూర్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



కౌటాల : మధ్యాహ్న భోజాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోట ప్రసాద్

ఏరియా వర్క్‌షాప్‌లో రక్షణ పక్షోత్సవాలు



నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా వర్క్ షాప్ ఆవరణలో 55వ రక్షణ పక్షోత్సవాలను శనివారం నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, ఈఅండ్ఎం జీఎం ఎస్.దామోదర్ రావు సారధ్యంలో బెల్లంపల్లి ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి ఏరియా వర్క్‌షాప్‌ను పరిశీలించారు. గతంలో మైనింగ్, డిపార్ట్‌మెంట్లలో జరిగిన ప్రమాదాలు ఎలా జరిగాయో వాటిని ఎలా అదిగమించాలో చెప్పారు. ప్రథమ చికిత్స చేసే విధానాన్ని పరిశీలించారు. సీపీఆర్ చేసే విధానాన్ని చూసి ఉద్యోగులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని విభాగాల్లో ఉద్యోగుల రక్షణకు సింగరేణి పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ఇంటినుంచే రక్షణాత్మకంగా పరికరాలు ధరించి విధులకు హాజరుకావాలని సూచించారు. మారుమూల ప్రాంతంలో ఉన్న 11 ఏరియాలతో పోల్చితే రక్షణ ఏర్పాట్లు, ఉద్యోగుల్లో రక్షణ పట్ల అవగాహన ఎక్కువగా ఉందన్నారు. ట్రేడ్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. కళాకారులు పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఎస్.తిరుపతి, ఎస్ఓటూ జీఎం కె.రాజమల్లు, ఇంజినీర్ భీంరావ్ జాడే, వర్క్‌షాప్ డీజీఎం కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని కాజగ్‌నగర్‌లోని చింతగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతదేశ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్ మాట్లాడుతూ గణితం ఒక భాగమని గణితాన్ని నేర్చుకున్న విద్యార్థి తన నిత్యజీవిత సమస్యలను తానే స్వయంగా సాధించగలుగుతాడని తెలిపారు. గణితాన్ని ఇష్టంతో నేర్చుకోవాలన్నారు. గణిత ఉపాధ్యాయులు మోహన్ దుర్గం మాట్లాడుతూ శాస్త్రాలకే శాస్త్రం గణిత శాస్త్రమని నేడు ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం ఇంతగా అభివృద్ధి చెందడానికి గణితం కారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు గణిత క్విజ్ గణిత పజిల్స్ నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పండరినాథ్, గులాబ్ రావు, సంపతి, రజిత పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్టమస్ వేడుకలు



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఈనెల 25న జరుపుకోపోయే క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని శనివారం ఈడెన్ గార్డెన్ పాఠశాలలో మినీ క్రిస్టమస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో విద్యార్థులు నృత్యాలు, ఏసుక్రీస్తు జన్మదినానికి సంబంధించిన నాటికలతో పాటు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బైజు జాన్ మాట్లాడుతూ భారతదేశం విభిన్న సాంస్కృతి సాంప్రదాయాలకు అన్య మతస్తులు కలిసిమెలిసి ఉండాలని, విద్యార్థి దశనుంచే అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యార్థి మృతి



నవతెలంగాణ-బెజ్జూర్

ప్రభుత్వ వైఫల్యంతోనే విద్యార్థి మృతి చెందిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు లెండుగురే శ్యామ్‌రావు ఆరోపించారు. శనివారం బెజ్జూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 52 మంది విద్యార్థులు మృతి చెందారని, దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. అధికారులు నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మృతి చెందుతున్నారని ఆందోళన వ్యక్తి చేశారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఇటీవల విద్యార్థుల మరణాలు జరుగుతున్న మంత్రులు ఎమ్మెల్యేలు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇచ్చిన హామీ నెరవేరేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. విద్యార్థి మృతి పట్ల పరామర్శించిన నాయకులను అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ. 10లక్షల ఎక్స్‌గ్రేషియ చెల్లించాలని, కుటుంబానికి ఉద్యోగం ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సారయ్య, రాంప్రసాద్, దుర్గం తిరుపతి పాల్గొన్నారు.

అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-జన్నారం



రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాపై వెంటనే చర్యలు తీసుకొని, మంత్రివర్గం నుంచి భర్త రఫ్ చేయాలని రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ నాయకులు, కనికరపు అశోక్, కొండగుడ్ల లింగన్నలు మాట్లాడుతూ అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన అమిత్ షా పై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల నాయకులు, కూకటి కారు బుచ్చయ్య అంబటి లక్ష్మన్, దాసండ్ల రాజన్న, గుడ్ల రాజన్న ఎస్కే అబ్దుల్లా పాల్గొన్నారు.

ఆలోచనలు విరిసే..ఆవిష్కరణలు మెరిసే

నవతెలంగాణ-నస్పూర్

ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. పాఠశాల స్థాయిలోనే సృజనాత్మకత వెలికితీసి రేపటి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం ఏటా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహిస్తోంది. వినూత్న ఆలోచనలతో ప్రయోగాలు రూపొందించేలా ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా శనివారం శ్రీరాంపూర్ ఏరియాలోని విశ్వశాంతి హై స్కూల్‌లో ఉపాధ్యాయుల సహాయంతో విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టారు. వారు నిర్వహించిన సైన్స్ ఫేర్‌లో విద్యార్థుల ఆలోచనలకు ఆవిష్కరణలు ఆకట్టుకున్నారు. శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, ఎస్ఐ సంతోష్, నస్పూర్ పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ, కరెస్పాండంట్ రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడానికి సైన్స్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించామని, విద్యార్థుల ప్రతిభతో పలు ఆవిష్కరణలు ప్రదర్శించామన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వాళ్ళ ప్రతిభను వెలికి తీసినట్లు అవుతుందని తెలిపారు.

మహిళా సాధికారత హబ్ ఆధ్వర్యంలో అవగాహన



నవతెలంగాణ-లక్షెట్టిపేట

మహిళా సాధికారత హబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్మార్ట్ లీవింగ్ ప్రోగ్రామ్ భేటీ సమ్మాన్‌లో భాగంగా మహిళా సాధికారక హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్స్ లిటరసీ లిప్సిక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ భేటీ బచాఓ-భేటీ పడాఓ పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్యవివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, మహిళ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీస్ హెల్ప్ లైన్ 100, సీనియర్ సిటిజెన్ హెల్ప్ లైన్ నంబర్ 14567, సైబర్ క్రైమ్ 1930 పోక్సో ఆక్ట్, నేషనల్ ఎమర్జెన్సీ, సుకన్య సమృద్ధియోజనా, మిషన్ వాత్సల్య 112 ఆడ పిల్లల ప్రాముఖ్యత గురించి , మహిళా సాధికారత, మొదలగు హెల్ప్ లైన్ నెంబర్లను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని, ప్రీ ప్రయిమరీ కోఆర్డినేటర్ రోజారాణి, కాలిగ్రఫీ సృజన పాల్గొన్నారు.

10న కళాకారుల పాటల బాట



నవతెలంగాణ-జన్నారం

నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో వచ్చే నెల జనవరి 10న పాటల బాట కార్యక్రమంలో భాగంగా 12 గంటల గాన లహరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కళాకారులు కొండుకూరి రాజు, లింగంపల్లి రాజలింగం తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నిరుద్యోగ కళాకారులతో పాటు తెలంగాణ ఉమ్మడి పది జిల్లాల కళాకారులు పాల్గొననున్నారని, తెలంగాణ ఉద్యమంలో ప్రజల్ని చైతన్యపరిచి తెలంగాణ ఉద్యమానికి మా వంతు కృషి చేశామని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 550 కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించారు. అప్పటి నుంచి మాకు ఉద్యోగాలు రాక మేము మా కుటుంబాలు రోడ్డున పడి ఏ పని పాట లేక అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఉద్యోగం ఉపాధి కల్పించాలని మేము ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామని అన్నారు. ఇప్పటికైనా మా కళాకారుల బతుకుల్లో వెలుగు నింపే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి శారద, ఆవునూరి సత్తయ్య కొంకటి రాజేశ్వరి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

నవతెలంగాణ-నస్పూర్

రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సూర్యనారాయణ అన్నారు. శనివారం ఆర్కె-8 డిస్పెన్సరీలో డీవై సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కేంద్రంలో శిక్షణ తీసుకుంటున్న 45 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన వెంటనే ఒక మంచి కార్యక్రమంలో భాగస్వామ్యం అవుతున్న ఉద్యోగులందరూ అభినందనీయులని, అలాగే ఉద్యోగులందరూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ వీలైనప్పుడు రక్తదానం చేస్తూ ఉండాలని అన్నారు. వృత్తి శిక్షణ కేంద్రంలో పనిచేస్తున్న శిక్షకులు రాజ్ కుమార్ అందరికీ ఆదర్శమని వారు అనేకసార్లు రక్తదానం చేసి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని జీఎం తెలిపారు. కొత్తగా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు తప్పనిసరిగా వారికి కేటాయించిన విధులను నిర్వర్తించాలని సూచించారు. ఉద్యోగులు గైర్హాజరు కాకుండా తమ విధులకు హాజరవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమములో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, ఇందారం ఉపరితలగని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏవీరెడ్డి, వృత్తి శిక్షణ కేంద్రం మేనేజర్ కల్లూరి వెంకట రామారావు, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సభ్యులు కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గణిత శాస్త్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డిసెంబర్ 22న శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పాఠశాలలో గణిత రంగోళీ, గణిత శాస్త్ర మేళా, చిత్రలేఖనం, ఉపాన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన గణిత నమూనాలు, రంగోళి అందరిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి హాజరయ్యారు. విద్యార్థులకు శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలను వివరించారు. రామానుజన్ కృషితో ఎన్నో రకాల కార్యకలాపాలకు గణిత శాస్త్రం మూలమైందన్నారు. ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరని, అప్పట్లో ఇక పరిష్కారం కావు అనుకున్న సమస్యలకు కూడా ఇతను పరిష్కారం కనుగొన్నాడన్నారు. రామానుజన్ స్ఫూర్తితో విద్యార్థులు బాగా చదివి మేధావులుగా ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, గణిత శాస్త్ర అధ్యాపకులు సంయుక్త, భాగ్యశ్రీ, రవీందర్, ఉపాధ్యాయులు నాగ మల్లయ్య, ప్రవీణ్, శ్రీవర్ధన్, సుష్మా మాధురి, చైతన్య స్రవంతి, అనిత, మల్లేష్. మహేశ్వరి, రేణుక, పద్మజ, అశోక్ పాల్గొన్నారు.





జైపూర్‌లో..

జైపూర్ : మండల కేంద్రంలో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు గణిత దినోత్సవం జరుపుకున్నారు..ఈ సంధర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ల అర్పించారు..గణిత శాస్త్రంకు సంబంధించి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు..కాగా ఈ సంధర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించడంతో పాటు రంగోలి సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు..క్విజ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి చైర్మెన మద్దెల సునిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జన్నారం : మండలంలో ఘనంగా గణిత శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామనుజం చిత్రపతానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు గణిత ప్రదర్శనలు సులభమైన పద్ధతులను వివరించారు. వివేకానంద పాఠశాలలో విద్యార్థులు రామనుజం నంబర్ 1729 ఆకారంలో కూర్చోవడం ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జన్నారం : 1729 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

సిరొంచ బహుజన జాతరను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మంచిర్యాల

మహారాష్ట్రలోని సిరొంచ పట్టణంలో ఈ నెల 25న నిర్వహించే పులే సాహు అంబేద్కర్ బహుజన జాతరను తెలంగాణ ప్రాంత బహుజన బిడ్డలు విజయవంతం చేయాలని బహుజన సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాలలో సిరొంచ బహుజన జాతర గోడపత్రులను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా సిరొంచ పట్టణంలో బహుజన మహనీయులను స్మరిస్తూ జాతర నిర్వహిస్తారని తెలిపారు. పూలే సాహు మహారాజ్ అంబేద్కర్లు అందించిన బహుజన ఉద్యమ స్ఫూర్తిని ఈ తరానికి తెలియజేయడమే జాతర ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ దేశంలో మెజార్టీ వర్గమైన బీసీ, ఎస్సీ, ఎస్టీల ఉజ్వల భవిష్యత్తు కోసం సాహసోపేత పోరాటం చేసిన పూలే, సాహు, అంబేద్కర్‌ల సందేశాలను నేటి తరం స్వీకరించాలని తెలిపారు. అంబేద్కర్ పేరు ఎత్తకూడదు అంటూ నేటికాలం మనువాదులు ఝులుం చేస్తున్న వేల అంబేద్కర్ వాదులు మరింత సమరశీల ఉద్యమానికి ముందుకు రావాలని కోరారు. తెలంగాణ, మహారాష్ట్రల సంగమ స్థలంగా ఉన్న సిరొంచ జాతరను ఈ యేడాది సైతం బహుజన బిడ్డలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిరొంచ బహజన జాతర కమిటీ సభ్యులు ముట్ట శంకర్, శుభం కుమ్మరి, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుర్గం రామ్మూర్తి, బీసీ ఐక్య వేదిక నాయకులు కనుకుంట్ల మల్లన్న, సామాజిక ఉద్యమకారులు కామిల్ల జయరావు, మోతె రామదాసు చలమల్ల అంజయ్య రవీందర్, జాడి రాజేశ్ పాల్గొన్నారు.



పాఠశాలల్లో ఘనంగా తెలంగాణ ఆహారోత్సవం



జైపూర్ : ఇందారం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆహారోత్సవం

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని రేండ్లగూడ యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆహారోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ఇంటి వద్దనే వండుకొని తీసుకువచ్చి పాఠశాలలో ప్రదర్శించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు విమల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సూచనల మేరకు 'మన బడిలో ఆహారోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. పిల్లలకు ప్రతి రోజూ తప్పక టిఫిన్ చేయించి పాఠశాలకు పంపాలని సమతౌల్యం ఆహారం ఆవశ్యకత తెలిపారు. సమతుల్య ఆహారంపై చక్కటి పాట పాడి వినిపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విమల, సుజాత, శ్రీలత, మంజుల, రోజా విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాదంపల్లి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

మండలంలోని బాదంపల్లి జడ్పీ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. శనివారం ఉదయం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు తయారుచేసిన వివిధ ఆహార పదార్థాలను ఫుడ్ ఫెస్టివల్లో ప్రదర్శించారు. పాఠశాల హెచ్‌ఎం జాడి ప్రభాకర్, తదితరులు పాల్గొని వాటిని రుచి చూశారు.

తాండూర్ : మండలంలోని మాదారం-2 పాఠశాలలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా నిర్వహించిన తెలంగాణ ఆహారోత్సవంలో వివిధ రకాల ప్రాంతీయ వంటకాలని తల్లులు వండుకుని వచ్చారు. విద్యార్థుల తల్లులు రోజువారీగా పిల్లలకి ఇచ్చే ఆహారంలో పోషకాల ప్రాధాన్యత, తృణ ధాన్యాల ప్రాముఖ్యత, పీచు పదార్థాల ఆవశ్యకత గురించి ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి అవగాహన కలిగించారు. మన తెలంగాణ ప్రాంత ప్రత్యేక వంటకాలైన చకినాలు, సర్వపిండి, రాగి లడ్డు మొదలగు సంప్రదాయ వంటకాలని ప్రాంతీయంగా దొరికే ఆకుకూరలు, పండ్లు ఎలా పిల్లలకు ఆహారంలో భాగంగా అందజేయాలో బృందాల వారిగా చర్చించారు. చిన్న చిన్న అనారోగ్యాలకు వంట ఇంటి చిట్కాలు, పిల్లలలో కలిగే పోషక లోపాల్ని అధిగమించే దిశగా తల్లులు ఎలాంటి ఆహారాన్ని పరిచయం చేయాలో పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

జైపూర్ : విద్యాతో పాటు విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వం కామన్ మెను ప్రవేశపెట్టిందని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. , ఇందారం జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం తెలంగాణ ఆహారోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ విషయమై పలు సూచనలు చేశారు. పోషక విలువలు కలిగినటువంటి ఆహారాన్ని పిల్లలకు వండి వడ్డించాలని తెలిపారు. విద్యార్థులకు మంచి చదువు మంచి ఆరోగ్యం అవసరమని తెలిపారు. వీలైనంత వరకు కూరగాయలు, ఆకు కూరలు ఆహారంగా ఇవ్వడం ద్వార విద్యార్థులకు మంచి ఆరోగ్యవంతులుగా ఎదుగుతారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోషక విలువులు కలిగివున్న తెలంగాణ వంటకాలను ప్రదర్శించడంతో పాటు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో గోపగాని రవీందర్, ఎం రమేష్, కే రమేష్, మంజుల, సంధ్యారాణి, చక్రధర్, నవీన్ పాల్గొన్నారు.

బుద్ధి చంద్రమౌళి ఆశయాలను కొనసాగించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

అమరజీవి బీసీ ఉద్యమ నాయకుడు బుద్ధి చంద్రమౌళి ఆశయ సాధన కోసం బీసీ బిడ్డలందరూ కృషి చేయాలని బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 19న మంచిర్యాలలో మరణించిన బుద్ధి చంద్రమౌళి సంస్మరణ సభను శనివారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల బీసీ భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ బుద్ధి చంద్రమౌళి చేపట్టిన సామాజిక సేవను కొనియాడారు. కష్టపడి ఉన్నత స్థానానికి ఎదిగిన బుద్ధి చంద్రమౌళి మందమర్రి మంచిర్యాల సింగరేణి ప్రాంతాలలో కష్టజీవులకు అండగా నిలిచాడని గాండ్ల తెలికుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా, బీసీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడిగా ఆయన చేసిన సేవలను నేటి తరం గుర్తుంచుకుంటుందన్నారు. మందమర్రి ప్రాంతంలో దొరల ఆగడాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన సింగరేణి బిడ్డల ఉద్యమాలకు చంద్రమౌళి జీవితాంతం అండగా నిలిచారని పేర్కొన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు బాసటగా నిలిచి తన ఇంట్లోనే పెళ్లిళ్ల జరిపించిన సంస్కరణాభిలాషిగా నిలిచారని స్పష్టం చేశారు. బుద్ధి చంద్రమౌళి ఆశయాలని నిలబెట్టే రీతిలో మంచిర్యాల గడ్డపై బీసీ, బహుజన ఉద్యమాలని కొనసాగించడమే ఆయనకు ఇచ్చే సరైన నివాళి అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక వ్యవస్థాపకులు కనుకుంట్ల మల్లయ్య, సీనియర్ నాయకులు చలమల్ల అంజయ్య, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ యూత్ నాయకులు పెద్దోళ్ల చంద్రకాంత్, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జైపాల్ సింగ్, బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎం రాందాస్, సామాజిక ఉద్యమకారులు కామిల్ల జయరావు, కైలాసం, వెన్నంపల్లి రవీందర్, సుధాకర్, రాజ్ కిరణ్, లతీఫ్, రాజేష్, బుద్ధి చంద్రమౌళి పాల్గొన్నారు.



నెన్నెల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని నెన్నల పోలీస్‌స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ ఎ.రవికుమార్ వార్షిక తనిఖీల్లో భాగంగా పరిరక్షించారు. బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్‌తో కలిసి సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో చెట్లు నాటారు. పోలీస్ సిబ్బందికి నిర్వాహణలో ఎదురయ్యే సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ రికార్డ్స్, పోలీస్ అధికారులు సిబ్బంది వివరాల గురించి ఆరా తీశారు. పోలీస్‌స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, ప్రజల జీవన విధానం మావోయిస్టుల కదలికలు, వారి కుటుంబ సభ్యుల వివరాలు, సానుభూతి పరుల వివరాల గురించి ఎస్సై ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగే నేరాల వివరాలు, పోలీసుల విధి నిర్వహణలో రాజకీయ ప్రమేయం, రౌడీ షీటర్స్, సస్పెక్ట్ షీట్స్ వివరాలు తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల సంబంధించి ఎస్ఐ, సిబ్బంది గ్రామాలను సందర్శించి సమస్యాత్మక గ్రామాలు, ట్రబుల్ మంగర్స్ గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి గ్రామాలలోని ప్రజలతో మమేకం అవ్వాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని శాంతి భద్రతలకు ఆటంకం కలగకుండా బాధ్యతలు నిర్వర్తించాలని తెలిపారు,

24 గంటల దీక్ష కరపత్రాలు విడుదల



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ముందు ఈ నెల 24న ఉదయం 7 గంటల నుంచి కార్మికుల సమస్యలపై మాజీ ఓరియంట్ గుర్తింపు సంఘం అధ్యక్షుడు రాములు నాయక్ 24 గంటల దీక్ష చేపడుతున్నట్టు ఓరియంట్ సిమెంట్ పర్మినెంట్ వర్కర్స్, లోకల్ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓరియంట్ కంపెనీ గేటు ముందు సంబంధిత దీక్ష కరపత్రాలను విడుదల చేశారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ సీకే బిర్లా యాజమాన్యం ఆదాని గ్రూపులకు అమ్మకం చేస్తున్న క్రమంలో ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నాలుగో ప్లాంట్లో కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు, ఉచిత విద్యుత్, తాగునీరు అందించాలని, నాలుగో ప్లాంట్లో కల్పించే 4000 ఉద్యోగాలు స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్లపై దీక్ష చేపడుతున్నట్లు, ఈ దీక్షలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తత్రు భీంరావు, సామ రాజిరెడ్డి, రామిళ్ల కిష్టయ్య, కే సతీశ్ రెడ్డి, సంద్ర భూమయ్య, గుండా శ్రీనివాస్, ముల్కల్ల రాములు పాల్గొన్నారు.

విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన

నవతెలంగాణ-జన్నారం

శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో సీపీఆర్‌పైన ప్రిన్సిపల్ కస్తూరి సతీష్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె ఆగిపోయినప్పుడు సీపీఆర్ ఎలా చేయాలి, జాగ్రత్తలు టిప్స్ శిక్షణ ఇచ్చారు. ఈ విద్యార్థులు రేపటి నుండి జన్నారంలో విద్యార్థులు అవేర్నెస్ కార్యక్రమాలు చేపడుతూ అందరికీ అవగాహన చేస్తారని తెలిపారు.

మౌంట్ కార్మెల్‌లో క్రిస్మస్ వేడుకలు



నవతెలంగాణ-హాజీపూర్

గుడిపేట మౌంట్ కార్మెల్ స్కూల్‌లో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫాథర్ ప్రిన్స్ పాల్గొన్నారు. జీసస్ పుట్టుక గురించి విద్యార్థులు నాటికను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ అల్ఫీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముత్యంపల్లి క్రీడా మైదానంలో ప్రభుత్వ భూమి కబ్జా

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని ముత్యంపల్లి క్రీడా మైదాన పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందని స్థానికులు తెలిపారు. క్రీడా మైదానం పరిసరాలు మొత్తం కూడా ప్రభుత్వ భూమి కాగా పలువురు కబ్జాదారులు నిర్మాణాలు చేపడుతున్నారని, దీంతో ప్రభుత్వ భూమి కాస్త కబ్జాకు గురవుతూ విశాలంగా ఉన్న ప్రాంతం ఇప్పుడు కబ్జాలతో ఇరుకు ప్రాంతంగా తయారవుతుందని తెలిపారు. నిర్మాణాలు చెపడుతున్న వారు తమ వద్ద పత్రాలు ఉన్నాయని చెప్పడం ఇంత కాలం రాని వారు ఇప్పుడు రావడమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా ఇప్పటి వరకు తన దృష్టికి రాలేదని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని నాగులవాయి గ్రామాన్ని నూతనంగా గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. శనివారం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాకు వినతిపత్రం అందజేశారు. నాగులవాయి గ్రామపంచాయతీ ఏర్పాటు చేస్తే అభివృద్ధి జరిగే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచ కొండ శ్రీవర్ధన్, బెజ్జూర్ మాజీ ఉపసర్పంచ్ బాపూరావు, నందయ్య, తిరుపతి శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలి

నవతెలంగాణ-కెరమెరి



విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తహసీల్దార్ దత్తు ప్రసాద్ రావు అన్నారు. శనివారం మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాల, సుర్దాపూర్ ఎంపీయూపీఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని తరగతి గదులను పరిశీలించారు. విద్యాభోదన తీరుపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనార్‌పల్లి ఆశ్రమ పాఠశాలలో మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంటకు వినియోగించే సరుకులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మెనూ పాటించి, వంట పాత్రలు, వంట గదిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలో సిబ్బంది పాల్గొన్నారు.

చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించాలి



నవతెలంగాణ-కెరమెరి

మండలంలో వివిధ గ్రామాల్లోకి చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించాలని మాజీ ఎంపీపీ పెందూర్ మోతీరాం అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలోని ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో విద్యుత్, నీటి సరఫరా, ఫ్లోరింగ్ తదితర పనులను చేపట్టినట్టు తెలిపారు. పనులు పూర్తి చేసి ఆరు నెలలు గడుస్తున్నా నేటికి బిల్లులు చెల్లించలేదన్నారు. అప్పులు చేసి అభివృద్ధి పనులు పూర్తి చేసి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో భాగంగా వివిధ గ్రామాల్లో చేపట్టిన సీసీ, మట్టి రోడ్ల బిల్లులు సైతం నేటి వరకు చెల్లించలేదని ఆరోపించారు. బిల్లులు చెల్లింపులో ఆలస్య చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు స్పందించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం సాంగ్వి మాజీ సర్పంచ్ తొడసం జగన్నాత్ రావు, కుంరం అంబరావు, భరత్ భూషణ్, బుచ్చన్న, మధుకర్, శంకర్ పాల్గొన్నారు.

అలరించిన వెల్ బేబీ షో

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గోలేటిలోని డిస్పెంసరిలో శనివారం నిర్వహించిన వెల్ బేబీ షో అలరించింది. కార్యక్రమానికి జీఎం శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాజరై చిన్నారుల ఆట, పాటను ఆసక్తిగా తిలకించారు. వైద్యులు చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వారి వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన సంపద లేదన్నారు. చిన్నారులకు మంచి పోషకాహారాన్ని అందించి క్రమం తప్పకుండ వ్యాక్సిన్లు వేయించాలన్నారు. పిల్లలను సెల్ ఫోన్ వాడకానికి దూరంగా ఉంచాలని సూచించారు. వెల్ బేబీ షోలో ప్రతిభ చూపిన చిన్నారులకు ఈ నెల 23న సింగరేణి డే వేడుకల్లో బహుమతులు ప్రధానం చేయనున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు ఎస్.తిరుపతి, సేవాసమితి అధ్యక్షురాలు ఉమారాణి, డిప్యూటి సీఎంఓ మధుకుమార్, డిప్యూటి ఎంఎస్ ఎం.మురళీమోహన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఎం కప్ కబడ్డీలో చైతన్య విద్యార్థి ప్రతిభ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల్లో జిల్లా కేంద్రంలోని చైతన్య విద్యార్థి కబడ్డీ క్రీడలో ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా కళాశాల కరెస్పాండెంట్ రాజశేఖర్ విద్యార్థిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఎండీ ఫజల్ కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన టీంలో సభ్యుడుగా ఉన్నాడని, ఈనెల 27 నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల క్రీడాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి నాయకుల అరెస్ట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బీసీ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ విద్యార్థిని మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగే ప్రయత్నం చేసిన నాయకులను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు జయరాజ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి చిరంజీవి, నాయకులున్నారు.

ఏఈఈ అసోసియేషన్ ఏర్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలోని అన్ని శాఖల అసిస్టెంట్ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్లు సమిష్టిగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఏఈఈ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. అధ్యక్షునిగా రాజ్ కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్, జనరల్ సెక్రటరీగా పవన్ కళ్యాణ్, ఉపాధ్యక్షులుగా సాయి కృష్ణ, మౌనిక, ట్రెజరర్‌గా సాయితేజ, జాయింట్ సెక్రటరీస్‌గా క్రాంతి, సాయి సిద్దార్థ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మణితేజ, స్వామిని ఎన్నికయ్యారు.

24న మినీ జాబ్ మేళా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రంలో ఈ నెల 24న ఉదయం 11 గంటలకు జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు మినీ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ కార్డ్ జీనియస్ కన్సల్టెంట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల, గోదావరిఖని, ఆసిఫాబాద్, కరీంనగర్, హైదరాబాద్ ప్రాంతాలలో పని చేసేందుకు 100 బ్రాంచ్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నుండి ఏదేని డిగ్రీ కలిగి ఉండాలని, 19-30 సంవత్సరాల వయసు కలిగి ఉండాలని తెలిపారు. ఇతర వివరాలకు 9440514962, 9502786438, 9160608476 నెంబర్‌లలో సంప్రదించవచ్చని తెలిపారు. ఆసక్తి, అర్హత గల జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భద్రతా చర్యలు కచ్చితత్వంతో పాటించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బ్యాంకులలో భద్రతా చర్యలు కచ్చితత్వంతో పాటించాలని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సీసీటీవీలు, మోషన్స్ సెన్సార్, అత్యాధునిక అలారం పద్ధతులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క బ్యాంకులో భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతమైన నూతన అత్యాధునిక పరికరాలను వినియోగిస్తూ కచ్చితత్వంతో భద్రతా చర్యలను చేపట్టాలని తెలిపారు. ఆదిలాబాద్ మండలం రామాయి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో వారం రోజుల కిందట అంతరాష్ట్ర దొంగల ముఠా దొంగతనానికి యత్నించగా బ్యాంకు సిబ్బందితో భద్రత చర్యలపై సమీక్షించి పరిశీలించారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో అదనపు ఎస్పీ బి.సురేందర్ రావు ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు జిల్లా మేనేజర్లు, రీజనల్ మేనేజర్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా బ్యాంకు స్ట్రాంగ్ రూములను కాంక్రీట్‌తో ధృడంగా నిర్మించాలని సూచించారు. రాత్రి సమయాలలో చుట్టుపక్కల ప్రాంతాలలో పూర్తిగా కనిపించే విధంగా లోపల బయట సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. బ్యాంకు లాకర్ రూమ్‌లో సెన్సార్లను, కెమెరాలను అమర్చి వాటిని తరచూ పరిశీలిస్తూ ఉండాలని తెలియజేశారు. దొంగతనాలను నివారించడానికి ప్రజల వద్ద ఎలాంటి నమ్మకాన్ని పోగొట్టుకోకుండా కచ్చితమైన భద్రతా చర్యలను పాటిస్తూ ఉండాలని సూచించారు. వీలైతే బ్యాంకుల్లో రాత్రి సమయాలలో సెక్యూరిటీ గార్డులను, వాచ్మెన్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. అలారం మోగినట్లయితే చుట్టుపక్కల వాళ్లకు వినబడే విధంగా ఎక్కువ శబ్దం కలిగిన అలారాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్‌రెడ్డి, సిఐలు సునీల్‌కుమార్, డి సాయినాథ్, ఎ.వెంకటేశ్వరరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, తెలంగాణ గ్రామీణ బ్యాంకు రీజినల్ అధికారి ప్రభుదాస్, జిల్లాలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

తెలంగాణ బోనాలు, గుస్సాడీ నృత్యాలతో నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించి రెగ్యులర్ చేయాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు ఈనెల 10 నుంచి చేస్తున్న సమ్మెలో భాగంగా 12వ రోజు ఆదివాసీ సాంప్రదాయ నృత్యమైన గుస్సాడీ కళాకారులు, తెలంగాణ పండుగ బోనాలతో మహా ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన ర్యాలీ సందర్భంగా జిల్లా కేంద్రం నినాదాలతో మార్మోగింది. సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక అధ్యక్షతన కలెక్టరేట్ నుండి ప్రారంభమైన ర్యాలీ ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ముందు నుండి వివేకానంద చౌక్, అంబేద్కర్ చౌక్ వరకు సాగి అక్కడ మానవహారంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ మాట్లాడుతూ 12 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

మద్దతు తెలిపిన నాయకులు

సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరసన దీక్షకు వామపక్ష నాయకులు దుర్గం దినకర్, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరు శ్రీనివాసరావు, కార్యదర్శి అనిల్, ఎస్టీటీ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శంకర్, చైతన్య, యూటీఎఫ్ జిల్లా నాయకులు రమేష్, హేమంత్, నవీన్ సుశీల్ మద్దతు తెలిపారు.



కార్యక్రమంలో కేజీబీవీల ప్రత్యేక అధికారులు మీనా, దుర్గం సందీప్, రాజ్ కుమార్, దేవేందర్, భార్గవి, మదనశ్రీ, సత్పుత్ రావు, త్రివేణి, వినోద, సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా గౌరవ అధ్యక్షులు మోహన్, ఉపాధ్యక్షురాలు నాగసుధ, ప్రధాన కార్యదర్శి తుకారం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ చైతన్య, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజేష్, వెంకటేష్, పీజీసీఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్ తిరుపతి, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ బాబు, వెంకటేష్, సుభాష్, సతీష్, పవన్ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఉట్నూర్

అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో శనివారం ఐబి చౌరస్తాలో ప్రజా సంఘాలు, దళిత సంఘాల ఆధ్వరంలో అమిత్ షా ఫ్లెక్సీని దహనం చేశారు. జై భీమ్ అంటూ నివాదాలు చేస్తూ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా కాంబ్లే ప్రజ్ఞాశీల్, దసండ్ల ప్రభాకర్, సింగారే భారత్, కాటం రమేష్, భారత్ చవాన్ మాట్లాడుతూ దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక సమానత్వానికి ప్రతీక అయిన అంబేద్కర్‌ను అవమానించడం అంటే దేశ ప్రజలను అవమానించడమే అని తెలిపారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నం చేస్తోందని పేర్కొన్నారు. అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు మొకింద్, మాణిక్‌చంద్, రాజమణి, రంజనాబాయి, తారాబాయి, కొత్తపల్లి గంగేష్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : అంబేద్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజలకు క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు వేముల, యూత్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్, నరసింహచారి, ఫేరోజ్, కిరణ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా జర్నలిస్టుల, ఉద్యోగుల క్రీడా పోటీలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జర్నలిస్టులకు, ప్రభుత్వ ఉద్యోగులకు సీఎం కప్ పోటీల్లో భాగంగా నిర్వహించిన క్రీడా పోటీలు అట్టహాసంగా జరిగాయి. శనివారం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించగా డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. చెస్, క్యారం, వాలీబాల్, బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్ పోటీలు నిర్వహించారు. జర్నలిస్టులు ఆయా శాఖ ప్రభుత్వ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం స్టేడియంలో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీపీఆర్ఓ తిరుమల పాల్గొన్నారు. కార్యక్రమంలో పీడీలు జక్కుల శ్రీనివాస్, ఎస్.స్వామి, కోచ్‌లు రాజు, రమేష్, క్రీడా సిబ్బంది చంద్రకాంత్, జర్నలిస్టులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-నార్నూర్

ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ జవహర్ గ్రామ కార్యదర్శులకు సూచించారు. శనివారం మండలంలోని బలాన్‌పూర్, నాగల్‌కొండ, మరపగూడ, బేతల్‌గూడ, సోనాపూర్ తదితర గ్రామాల్లో సర్వే తీరును పరిశీలించారు. ఇల్లు లేని పేదలను గుర్తించి ఎప్పటికప్పుడు ఫొటో అప్లోడ్ చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం గడువులోగా సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వేలో కార్యదర్శులు అవినాష్, స్నేహ, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏజీపీగా నియమితులైన అసిఫ్ అలీకి ఎమ్మెల్యే సన్మానం

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ కోర్టు ఏజీపీగా నియమితులైన న్యాయవాది ఆసిఫ్‌అలీని శనివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అసిఫ్ అలీని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ బాధ్యతలు పూర్తి బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని తెలిపారు. ఈయన వెంట సీనియర్ న్యాయవాది, కాంగ్రెస్ నాయకులు మొహమ్మద్ ఖాజా ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం కేసు నమోదు

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని నాగపూర్ గ్రామ అనుబంధ గ్రామం ఐకేరెడ్డి కాలనీకి చెందిన జాదవ్ సురేష్(45) అదృశ్యమైనట్టు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. గురువారం బ్యాంక్ వెళ్లి వస్తానని చెప్పి రెండు రోజులైనా రాకపోయే సరికి భార్య వత్సల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

నవతెలంగాణ-తాంసి

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వంద శాతం ఉత్తీర్ణత వచ్చే విధంగా ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ వసంతరావు ఉపాధ్యాయులకు, సిబ్బందికి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని అకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న భోజనం, సరుకులను పరిశీలించారు. బోధనకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. ఆయన వెంట వార్డెన్ హరీష్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు యోగా క్లాసులు

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం యోగా మాస్టర్ మల్లేశం విద్యార్థులకు యోగా ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం బాగుంటుందని, ప్రతి ఒక్కరూ యోగా చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ధనరాజ్, అధ్యాపకులు శ్రీనివాస్, శ్రీలత, సువర్ణ, గణేష్, వినోద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్, సుజాత, సవీన్, దశరథ్, కిషోర్, రూప పాల్గొన్నారు.



ఘనంగా గణిత దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

గణిత శాస్త్ర గొప్పదనాన్ని దశదిశలు చాటిన ఘనత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసే నివాళులు అర్పించారు. ఆదర్శ పాఠశాల, సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రకృతి సిద్ధంగా లభించే వివిధ రకాల వస్తువులతో గణిత శాస్త్ర సూత్రాలు వస్తువుల తయారుచేసి ప్రదర్శింపజేశారు. అదే విధంగా కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి ప్రకాష్ అధ్యక్షతన గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితం పట్ల అవగాహనతో పాటు ప్రాముఖ్యతను తెలిపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కళాశాల గణిత అధ్యాపకుడు యాదగిరిని విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా దీపాలంకరణ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన



సింగరేణి డేను పురస్కరించుకొని శనివారం గోలేటి శ్రీభీమన్న మైదానంలో శనివారం దీపాలంకరణ పోటీలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు ఉమారాణి శ్రీనివాస్, జీఎం ఎం.శ్రీనివాస్ పోటీలను వీక్షించారు. ఆకర్షణీయంగా ముగ్గులు వేసిన మహిళలకు 23న జరిగే వేడుకల్లో బహుమతులు అందించనున్నారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సీనియర్ సేవా సభ్యురాలు శంకరమ్మ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ జూనియర్ బాలబాలికల జట్టు ఎంపిక పోటీలను జిల్లా యువజన క్రీడల అధికారి రమాదేవి, ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి కనపర్తి రమేష్, ఆశ్రమ పాఠశాలల క్రీడాధికారి బండ మీనారెడ్డి ప్రారంభించారు. క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలని సూచించారు. ఉమ్మడి జిల్లా నుండి 200 మంది బాల బాలికలు పోటీల్లో పాల్గొనగా బాలికల విభాగంలో ఆసిఫాబాద్ ప్రథమ స్థానం, ఆదిలాబాద్ ద్వితీయ స్థానంలో నిలువగా, బాలుర విభాగంలో మంచిర్యాల ప్రథమ, ఆసిఫాబాద్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. బాలుర నుండి 16 బాలికల నుండి 16 మందిని ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. వీరు ఈనెల 27 నుండి 29 వరకు వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, జీసీడీఓ శకుంతల, క్రీడ పాఠశాల హెచ్ఎం జంగు, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి సాంబశివరావు, కోచ్లు అరవింద్, సాగర్, తిరుమల్, రవి, రాకేష్, సాయి, కళ్యాణ్, శేఖర్ పీడీ, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



నవతెలంగాణ-నిర్మల్

సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరమని డిసిసి జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. నిర్మల్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన 37 మంది లబ్దిదారులకు శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ క్యాంప్ కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం సహాయ నిధితో ఆర్థిక చేయూతనందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పక్షాన, ప్రజా పాలన అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, సారంగాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, పట్టణ అధ్యక్షులు నందెడపు చిన్ను, కౌన్సిలర్లు శనిగారపు నరేష్, సోన్, దిలావర్‌పూర్, మామడ, నర్సాపూర్ మండల అధ్యక్షులు మధుకర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటల శ్రీనివాస్, లక్ష్మణచాంద జెడ్ పిటిసి ఓస రాజేశ్వర్, నిమ్మ సాయన్న, అరుగుల రమణ, కటకం రాజారెడ్డి పాల్గొన్నారు

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

నవతెలంగాణ-బోథ్

మండలములోని సొనాల గ్రామంలో వివేకానందతో పాటు పలు పాఠశాలల్లో శనివారం ప్రపంచ తొలి ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. యోగా ఉపాధ్యాయురాలు మునిగెల యోగిత మాట్లాడుతూ చదువుకునే విద్యార్థులకు, అన్ని వయసులో గల వారికి నిత్యం బిజీ లైఫ్‌స్టైల్‌తో టెన్షన్ పడుతున్నందున ఉపశమనం కోసం ధ్యానం మంచి సాధనమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ చైతన్య, ఉపాధ్యాయులు ఓరుగంటి ఇస్తారి, కోస్మెట్ శుద్ధోధన్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప ఆరాట్టు ఉత్సవం

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామి ఆరాట్టు ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్య, అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాలను బాదంపెల్లి గోదావరికి తీసుకువెళ్లి వేద పండితులు కాకేరి రాజనరేంద్ర శర్మ, రుకేశ్ శర్మ, సంజయ్ త్రిపాఠీల వేద మంత్రాలచే పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, అనంతరం స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను గోదావరిలో జలాభిషేకం అనంతరం స్వామి వారి చిత్రపటాలను ఉత్సవ విగ్రహాలను మండపం నుంచి జన్నారం మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి అయ్యప్ప దేవాలయం వరకు పేట తుళ్ళి ఆడుకుంటూ నృత్యాలు చేసుకుంటూ శోభయాత్ర కొనసాగించారు. అనంతపురం భక్తులకు దేవాలయంలో అన్నదానం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శీల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కిషన్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌గౌడ్ కన్నె కత్తి గంట గురుస్వాములు పాల్గొన్నారు.